విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 7, ఆగస్టు 2025

నిరంతరం ప్రజల పక్షాన నిలిచేది సీపీఐనే..

- ప్రజలకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి...
- ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ ముద్దు...
- సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

విశాలాంధ్ర-శింగనమల : నిరంతరం ప్రజల పక్షాన నిలిచేది సిపిఐ పార్టీనే అని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని కోరారు. శింగనమల మండల కేంద్రంలో సిపిఐ నియోజకవర్గ 11వ మహాసభలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి,జాఫర్, సహాయ కార్యదర్సులు పాల్యం నారాయణస్వామి, చిరుతల మల్లికార్జున, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్‌లు హాజరయ్యారు, ముందుగా రామాలయం దగ్గర సిపిఐ జిల్లా కార్యదర్శి సీ,జాఫర్ సిపిఐ జెండాను ఆవిష్కరించారు, అనంతరం ర్యాలీతో బయలుదేరి వాసవి కళ్యాణ మండపంలో నియోజకవర్గ మహాసభ నిర్వహించారు. ఈ సభకు నియోజకవర్గ కార్యదర్శి టి నారాయణస్వామి అధ్యక్షత వహించారు, ఈ సందర్భంగా సి.జాఫర్ మాట్లాడుతూ మండలంలోని తరిమెల, ఇల్లూరు గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు నాగిరెడ్డి, సంజీవరెడ్డిలు, పుట్టారని, గల్లీ నుండి ఢిల్లీ వరకు పేరు మోసిన గడ్డ, ఉద్యమాల పురిటిగడ్డ శింగనమల మండలమని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగించే సమయంలో లోకేష్ పాదయాత్రలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పి నేడు పేదల ఇళ్లకు బిగిస్తూ పెను భారం మోపుతున్నారన్నారు. ఎన్నికల ముందు గ్రామాలలో 3 సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామనిప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని అరకొరగా అమలు చేసి, ప్రజలను నిరాశకు గురిచేస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ, ఆర్,ఎస్,ఎస్, కనుసన్నల్లో పనిచేస్తూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాల్లో కులాలు, మతాలు, భాషల, వర్గ, వర్ణాల మధ్య చిచ్చుపెడుతూ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, మనుధర్మ శాస్త్రాన్ని తీసుకు రావాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. నేటి కరువు పరిస్థితిలో వర్షాలు కురవక పంటలు పండక భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండి పంటలు మాడుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ముందుకు రాకపోవడం శోచనీయం అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శులు పాల్యం నారాయణ స్వామి, చిరుతల మల్లికార్జునలు మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టినప్పటి నుండి ధరలకు రెక్కలొచ్చి ఆకాశాన్ని అంటు తున్నాయని, మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలు పెరిగి పోతున్నాయని వాటిని నియంత్రించటలో కేంద్రం వైఫల్యం చెందిందన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. ఈవీఎంలు పారదర్శకంగా లేనందున, ప్రజలు ఈవీఎంలు వద్దు బ్యాలెట్ ముద్దంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం కేటాయించి ఒక్కో ఇంటికి ఐదు లక్షలు మంజూరు చేసి ఇసుము, ఇసుక, ఇటుక, ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ప్రతినెలా 3000 రూపాయలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, చెప్పిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. సుపరిపాలన ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ పేరుతో పిల్లల దగ్గరకు వచ్చి ప్రచారం చేస్తున్నారని, ఆ నాయకులను నిలదీయాలన్నారు. ప్రస్తుతం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ మాటలు మాయల ఫకీర్ పోషణ పోషిస్తున్నాడన్నారు. జవాన్లకు సరైన అధికారాలు ఇవ్వలేకపోతున్నారని, అందువల్ల ముష్కరుల ధాటికి ప్రాణత్యాగం చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేస్తూ బడ భూస్వాములకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి, సిపిఐ శింగనమల మండల కార్యదర్శి మధు యాదవ్, సిపిఐ పుట్లూరు మండల కార్యదర్శి పెద్దయ్య, నార్పల మండల కార్యదర్శి గంగాధర్, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి బండి రామకృష్ణ, గార్లదిన్నె మండల కార్యదర్శి రాముడు, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రమేష్, డీఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్ చౌదరి, చేతి వృత్తిదారుల జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, సిపిఐ సీనియర్ నాయకులు మర్రిస్వామి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీటీ రామాంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మునిస్వామి, చేనేత మధు, చికెన్ భాష, ఆనంద్, లలితమ్మ, బండి వెంకటరాముడు, రామ సుబ్బారెడ్డి, శివారెడ్డి, లక్ష్మీదేవి, కరుణ, గంగాధర్,చేపల రామంజి, పెద్దిరాజు, రసూల్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిరంతరం నిలబడదాం..

తొమ్మిదో మహాసభలో నాయకులు

విశాలాంధ్ర-గుత్తి : గ్రామీణ సిపిఐ మహాసభలు బుధవారం గుత్తి పట్టణంలో నిజాం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి నిజాం ఫంక్షల ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ పట్టణ కార్యదర్శి రాజు అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్రం కోసం నిరంతరం కష్టపడిన కష్టపడి ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడిన ఏకైక పార్టీ సీపీఐనే అన్నారు. ఈనాడు అనేక రాజకీయ పార్టీలు పుట్టుకొస్తున్నాయి అయినా సీపీఐ పార్టీకి ఇవన్నీ తగ్గటం లేదన్నారు. ప్రతి ఉద్యమం వెనక సిపిఐ ప్రజా సంఘాల పాత్ర కీలకంగా ఉందని అలాంటి పార్టీ మహాసభలు మనము ఘనంగా నిర్వహించుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు, పేదలపై పన్నులు, విద్యుత్ వారాలు పడకుండా చూడాలని సిపిఐ పార్టీ పలుమార్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసినా గత రాష్ట్ర వైఎస్సార్ ప్రభుత్వం కేంద్రానికి ఆదానికి తలవంచి విద్యుత్ ఒప్పందాలు చేసుకుందని.. నేడు టిడిపి ప్రభుత్వం ఎన్‌డిఏ ఫోటో ప్రభుత్వం అమలు పరుస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు వల్ల 25 సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రజలపై రూ.లక్ష పదివేల కోట్లు పెనభారం మోపుతోంది అందులో ఒక సంవత్సరానికి రూ.17845 కోట్లు వసూలు చేసిందని మండిపడ్డారు. ఇలా సర్‌చార్జీలని తదితర పన్నులు ప్రజలపై పెనుభారం మోపడాన్ని ఖండించారు. ఈ సమస్యను క్షేత్రస్థాయి కూడా తీసుకువెళ్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక చేస్తున్నాం మరోపక్క పి ఫోర్ అనే విధానాన్ని తీసుకొచ్చి కొన్ని కుటుంబాలు అధికారులు ప్రజాప్రతి నిధులు దత్తకు తీసుకుంటున్నామని పత్రికల్లో వస్తున్నాయి మేము పి ఫోర్ కు వ్యతిరేకులం ఆంధ్రప్రదేశ్లో అనాథలు వేలాదిమంది ఉన్నారు మీరు రైల్వే స్టేషన్ లోనూ బస్టాండ్ దగ్గర బిక్షం ఎత్తుకునే పరిస్థితి రాకుండా పి4లో పొందపరిస్తే చాలా సంతోషం, గుత్తి పట్టణంలో ఇళ్ల స్థలాల కోసం వేలాది అర్జీలు ఇచ్చిన నేటికీ పరిష్కారం కాలేదు వీటిని వెంటనే పరిష్కారం చేయకపోతే సిపిఐ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి ప్రజలకు మేమే సిపిఐ పార్టీగా ఇళ్ల స్థలాలు పంచుతామని హెచ్చరించారు. మరోపక్క రైతులను ఆదుకుంటున్నామని రైతు సుఖీభవ కింద 7000 వారి అకౌంట్లో వేస్తున్నారు రైతులు బిక్షగాళ్లు కాదు వారికి పంట పండించే దానికి ప్రతి ఎకరాకు సాగునీరు విత్తనాలు ఎరువులు పనిముట్లు 90 శాతం సబ్సిడీతో ఇచ్చి ఆదుకోవా లన్నారు. గతంలో గుంతకల్ సిపిఐ శాఖ ఆధ్వర్యంలో హంద్రీనీవా నీరు నియోజకవర్గానికి అందించాలని రెండు సంవత్సరాల పోరాటాలు నడిపి అనంతరం అమరణ నిరాహార దీక్షకు గునుకోవడం వల్ల ప్రభుత్వం దిగివచ్చి గుత్తి వై టీ చెరువు పాతుకొచ్చేరువుకు అధికారికంగా 0. 06 టీఎంసీల నీరివ్వాలని ఉత్తర్వులు వచ్చాయి దీని అమలుపరిచే దాంట్లో ఎమ్మెల్యే సంబంధిత అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. గుంతకల్ నియోజకవర్గంలో మూడు చెరువులకు సంపూర్ణమైన నీటి కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శిగా రాజు సహాయ కార్యదర్శిలుగా మముద నజీర్ 9 మంది కమిటీ సభ్యులు, గ్రామీణ కార్యదర్శిగా రాందాసు 11 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సీపీఐ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-శింగనమల: మండల కేంద్రంలో బుధవారం జరిగిన నియోజకవర్గ మహాసభలో సిపిఐ శింగనమల నియోజకవర్గం నూతన కమిటీని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శులు పాల్యం నారాయణస్వామి, చిరుతల మల్లికార్జున, నియోజకవర్గ కోరం కమిటీ నూతన కార్యదర్శిని సహాయ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, సిపిఐ నూతన నియోజకవర్గ కార్యదర్శిగా తలారి నారాయణస్వామి, సహాయ కార్యదర్శులుగా చిన్నప్ప యాదవ్, మర్రి స్వామిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం నూతన కార్యదర్శి సహాయ కార్యదర్శిలు మాట్లాడుతూ సీపీఐ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తామని తెలిపారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-అనంతపురం: పంచాయతీ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న నీటి వనరుల ఆక్రమణలను గుర్తించి అట్టివారిపై నోటీసులు జారీ చేసి సత్వరమే తొలగించాలని డిఆర్ఓ మలోలా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నిఘా కమిటీ (వాచ్ డాగ్ కమిటీ) సమావేశాన్ని నిర్వహించి పలు ఆదేశాలు సూచనలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, నీటి వనరులు ట్యాంక్ బెడ్స్‌లో ఉన్న ఆక్రమణలను అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు బృందంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణలను తొలగించి నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్సీ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జెన్కోకు ప్రభుత్వ భూములు ముందస్తు స్వాధీనం

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని కుందనకోట, కమలపాడు 950 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ స్థాపన కోసం కుందనకోట గ్రామంలో 179.523 ఎకరాలు, కమలపాడు గ్రామంలో 75.38 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములను బుధవారం ఏపీ జెన్కో వారికి ముందస్తు స్వాధీనంకు అప్పగించినట్లు యాడికి తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో యాడికి తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు,మండల సర్వేయర్ శేషసాయి, విలేజ్ సర్వేయర్ మౌలాలి, గ్రామ రెవిన్యూ అధికారులు భీమేశ్వర్ రెడ్డి, గంగన్న, దామోదర్ నాయుడు జెన్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ అందజేత

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: కళ్యాణదుర్గం యూనియన్ బ్యాంక్‌లో పనిచేస్తున్న లోకేష్ సెట్టూరు మండలం బచ్చే హళ్లి గ్రామం గొల్లల దొడ్డి ప్రాథమిక పాఠశాలకు బుధవారం టివి అదిరించారు. దాతను ఎంఈఓ వాణి దేవి, కాంప్లెక్స్ చైర్మన్ రామకృష్ణ అభినందించారు. అనంతరం దాత లోకేష్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన విద్య అవసరం ఉంటుందనే టీవీ ఇచ్చానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వాణి దేవి, చిన్నంపల్లి కాంప్లెక్స్ చైర్మన్ రామకృష్ణ, పాఠశాల ప్రధానో పాధ్యాయులు,ఈరన్న, ఉపాధ్యాయుడు మంజునాథ్, పాఠశాల కమిటీ చైర్మన్ రాజన్న గ్రామస్తులు మచ్చన్న, చిత్తయ్యా, సోమలింగ, బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-యాడికి : పిన్నేపల్లి గ్రామంలో బుధవారం వైసిపి మండల సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు ఆధ్వర్యంలో వైసిపి నాయకులతో కలిసి రీ కాల్ మేనిఫెస్టో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారని ఏడాది గడిచినా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మిరెడ్డి శేఖర్‌రెడ్డి నారాయణరెడ్డి, రవిశంకర్ రెడ్డి కొండారెడ్డి ప్రకాష్ రెడ్డి, 19వ వార్డు మెంబరు శ్రీరాములు, అగ్గి రాముడు కంబగిరి రాముడు, వెంకట రాముడు, రోశన్న, శివ కృష్ణ పాల్గొన్నారు.

వేదవతి హగరికి భారీగా వరదనీరు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలో వివిధ గ్రామాల్లో రాత్రి ఒక్కసారిగా ఈదురు గాలులు వీస్తూ వర్షం పడింది. అక్కడక్కడ మొక్కజొన్న, పత్తి పంటలు వర్షపు నీటికి తడిసింది. ఈ వర్షం వల్ల మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వస్తుందని రైతులు వాపోయారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడం వల్ల వరద నీరు ఉద్దేహాల్ వేదావతి హగరికి భారీగా నీటి ప్రవాహం వచ్చింది. కొళగనహళ్లి కబాలి వంక భారీగా వరద నీరు పారింది.

అవరోధాలను అవకాశాలుగా మలచుకోవాలి

విశాలాంధ్ర-జేఎన్టియుఏ: అవరోధాలను అవకాశాలుగా మలుచుకుని లక్ష్యాలను చేదించుకోవాలని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆచార్య డాక్టర్ రామనాథన్, మెటా వేటర్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ మిషన్ లెర్నింగ్ విభాగంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మానసిక, శారీరక, ఆత్మస్థైర్యాన్ని ఇచ్చేలా ప్రోత్సహిస్తూ.. గమ్యం వైపు అడుగులు వేసేలా.. క్రమశిక్షణ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పద్మ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సీపీఐ మండల మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పామిడి : సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పామిడి పట్టణంలోని షాదీఖానాలో 12వ మండల మహాసభలను నిర్వహిస్తున్నామని వాటిని జయప్రదం చేయవలసినదిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు కే రహీం పిలుపునిచ్చారు. బుధవారం తన కార్యాలయంలో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ సామ్రాజ్యవాదం భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పేద బడుగు బలహీన వర్గాల పీడిత ప్రజల కోసం ఆవిర్భవించినదని, నాటి నుండి నేటి వరకు కార్మిక కర్షక వర్గాల ప్రయోజనాల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నాదని, దళిత గిరిజన మైనార్టీల బలహీన వర్గాల వారి హక్కుల రక్షణ కోసం వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం నిర్విరామంగా కృషి చేస్తూనే ఉన్నది అన్నారు. స్వాతంత్రం అనంతరం భూసంస్కరణ అమలు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించినదని, మతోన్మాదం ప్రజా వ్యతిరేక విధానాలకు సిపిఐ పార్టీ వ్యతిరేకమన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వ పాలనలో ఇసుక మద్యం మైనింగ్ గ్యాంబ్లింగ్ మైనింగ్ మాఫియాలకు వ్యతిరేకంగా ఆందోళనలో నిర్వహిస్తూ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: స్మార్ట్ మీటర్లు ట్రూ అఫ్ చార్జీలను వసూలు చేయకూడదని రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో గుంటకల్ ఆర్డీఓ శ్రీనివాసులకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రైతులకు బిగించకూడదునీ ట్రూ అఫ్ చార్జీలు వసూలు చేయరాదునీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేటు కి అనుకూలంగా రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించడం జరుగుతుందినీ రైతులు ,ప్రజలు కు కరెంటు చార్జీలు పెంచమని చెప్పే అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రజల పైన భారం మోపడం చాలా దారుణంనీ అన్నారు . కరెంటు వసతి ఎన్నో రకాలుగా ఉత్పత్తి తయారు చేసుకోవచ్చు ఆ విషయాల మరిచిపోయి కార్పొరేటు వారితో ఒప్పందాలు చేసుకొని ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. రైతు ప్రజల స్మార్ట్ మీటర్లు బిగించకూడదని, ట్రూ అఫ్ చార్జీలను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు జక్కన్న, నాగరాజు, లక్ష్మీదేవి, సువర్ణ,తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేపి డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజనం

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలోని ఎస్కేపి డిగ్రీ కాలేజీలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వారి సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినందుకు కళాశాల విద్యార్థిని విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. గుంతకల్ మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ పల్లెటూర్ల నుండి వచ్చే పేద విద్యార్థిని విద్యార్థులు కళాశాలకు క్యారేజీలు తీసుకు రావడానికి ఇబ్బంది పడేవారని.. అలాగే మధ్యాహ్నా నికే ఆకలితో తిరిగి ఇళ్లకు వెళ్లితున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గతేడాది కళాశాలలో పర్యటించినప్పుడు ఈ సమస్యలను వివరించా రన్నారు. ఈ మేరకు స్పందించి మరుసటి రోజు నుండే విద్యార్థులు ఆకలితో ఉండకూడదని మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.

విద్యార్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంచి పౌష్టిక ఆహారాన్ని అందించి సాయంత్రం వరకు కళాశాలలో చదువుకునేందుకు ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ హిమబిందు, కుటుంబ నాయకులు ఎస్కేపి డిగ్రీ ప్రిన్సిపాల్ ఏ.లక్ష్మయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెకానిక్స్ సంక్షేమమే ధ్యేయం..

విశాలాంధ్ర-తాడిపత్రి: టూ వీలర్ మెకానిక్స్ సంక్షేమమే తమ ధ్యేయం అని నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు షేక్ సుభాని పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అబ్దుల్ కలాం షాది ఖానాలో నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు షేక్ సుభాని జిల్లా ఇంచార్జ్ షేక్ రియాజ్ భాష, నలహాదారుడు మురళిరెడ్డి, ఆర్గనైజర్ ప్రెసిడెంట్ జాఫర్, సెక్రటరీ లాలుస్వామి తాడిపత్రి ఇంచార్జ్ అన్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా షేక్ సుభాని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం విద్యుత్ వాహనాలు రావడంతో టూ వీలర్ మెకానిక్స్‌కు కొంతకాలం నుండి పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కావున టూ వీలర్ మెకానిక్స్‌కు వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల మెకానిక్ దస్తగిరి, కిరణ్ కుమార్ రెడ్డి, లక్ష్పతి, గౌస్, మణి, ఓబిరెడ్డి, మహమ్మద్, రఫీ, మాభాష సాహెబ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత కామ్రేడ్ శివన్న మృతి

శివన్న మృతి పార్టీకి తీరని లోటు
జిల్లా కార్యదర్శి జాఫర్..

విశాలాంధ్ర-ఉరవకొండ: సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ హెూతూర్ శివన్న (73) బుధవారం అనారోగ్యంతో ఉరవకొండలో మృతి చెందారు. శివన్న వజ్రకరూరు మండలం చిన్న హెూతూరు గ్రామంలో జన్మించారు ఆయన పేదల పక్షపాతిగా కమ్యూనిస్టు పార్టీలో చురుకైన నాయకునిగా పని చేశారు. గతంలో ఏఐవైఎఫ్ నాయకులుగా, ఉరవకొండ నియోజకవర్గ సిపిఐ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, అనుబంధ రైతు సంఘం రాష్ట్ర నాయకులుగా అనేక సంవత్సరాలు పనిచేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాలలో శివన్న చురుగ్గా పాల్గొన్నారు. నియోజకవర్గంలో సీనియర్ పార్టీ నాయకులు కామ్రేడ్ రాకెట్ల నారాయణరెడ్డి, చాయాపురం రంగన్న, కోటిరెడ్డి నాయకత్వంలో జరిగిన అనేక పోరాటాలలో ఆయన కలిసి పనిచేశారు. నిత్యం రైతు, కార్మిక సమస్యలపై ఆయన తన గలాన్ని వినిపిస్తూ వచ్చారు. సమ, సమాజ స్థాపన కోసం, తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు కష్టపడుతూ తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన కామ్రేడ్ శివన్న మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, కేశవరెడ్డి తదితర నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండలో శివన్న భౌతిక గాయాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం కార్యదర్శి మల్లికార్జున, పార్టీ సీనియర్ నాయకులు చెన్నారాయుడు, శ్రీధర్, గన్నే మల్లేష్, పురిడి తిప్పయ్య, వన్నూరమ్మ, సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సిపిఐ, సిపిఎం వైసీపీ, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు కూడా శివన్న మృతికి సంతాపాన్ని తెలియజేశారు.

శివన్న మృతి బాధాకరం .. సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ శివన్న మృతి బాధాకరమని ఆయన మృతి పార్టీకి తీరని లోటని సత్యసాయి జిల్లా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. ఆయన మృతికి తన సంతాపాన్ని తెలియజేశారు.

ఆయన సేవలు మరువలేనివి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్

విశాలాంధ్ర- గుంతకల్లు: హెూతుర్ శివన్న (73) మృతి సిపిఐకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం అహర్నిశలు సిపిఐ బలోపేతం కోసం కృషి చేశారని సిపిఐ పార్టీ ఏ కార్యక్రమంలో అయినా కూడా ఆయన పాల్గొనే వాడని అన్నారు. పేదల పక్షపాతిగా భూ పోరాటంలో ఇళ్ల ఇళ్ల స్థలాల కైతేనేమి,కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషించారునీ అన్నారు.గతంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులుగా కూడా అనేక సంవత్సరాలు పనిచేశారునీ డి. జగదీష్ కొనియాడారు. అలాగే శివన్న కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని సానుభూతి తెలిపారు.

పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కామ్రేడ్ హెూతుర్ శివన్న (73) మృతి సిపిఐకి తీరని లోటని సిపిఐ అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శులు పాళ్యము నారాయణస్వామి, చిరుతల మల్లికార్జున, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. డి. సంజీవయ్య, జె.రాజారెడ్డి, ఎస్,శ్రీరాములు, సిపిఐ సీనియర్ నాయకులు పెద్దవడుగూరు సూర్యనారాయణ రెడ్డిలు తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నారాయణస్వామి, మల్లికార్జునలు మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం అహర్నిశలు సిపిఐ బలోపేతం కోసం కృషి చేశారని క్రమం తప్పకుండా పార్టీ అడుగుజాడల్లో నడిచాడని పేర్కొన్నారు. ఆయన పేదల పక్షపాతిగా ఏఐవైఎఫ్, రైతు సంఘం రాష్ట్ర నాయకులుగా కూడా అనేక సంవత్సరాలు పనిచేశారని.. శివన్న కుటుంబానికి సానుభూతి తెలిపారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి.. కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పై ప్రత్యేక దృష్టిని సారించాలని, అలాగే సి.యం.ఓ. మంత్రులు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రెవెన్యూ సెక్టార్, పిజి ఆర్ ఎస్, వివిధ సేవా పోర్టర్ల ద్వారా వచ్చిన ఫిర్యాదుల పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇంచార్జ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. వివిధ రీతిలో స్వీకరించిన ఫిర్యాదులపై అర్జీదారులు సంతృప్తి పొందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శైలజ, ఈజీఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, సర్వే ఏ.డి. రూప్ల నాయక్, కలెక్టరేట్ సూపరెంటెంట్లు పాల్గొన్నారు.

సత్తా చాటిన క్రీడాకారులు

విశాలాంధ్ర-ఉరవకొండ : ఈనెల 4 నుంచి 5వ తేదీలలో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు తరఫున ఉరవకొండలోని ప్రభుత్వ సెంట్రల్ హైస్కూల్లో విద్యనభ్యసిస్తున్న అమృత, అనిషా, వైశాలి,భవ్య, అంజలి, సఫియా, నరిత క్రీడాకారులు జిల్లా జట్టు తరఫున పాల్గొని సత్తాచాటారు. పోటీలలో చిత్తూరు, పశ్చిమ గోదావరి, నెల్లూరు,తూర్పుగోదావరి జట్లతో పోటీపడి గెలుపొం దారు. ఫైనల్ పోటీలో కడప జిల్లా జట్టుతో తలపడి ద్వితీయ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు రజక పతకాలు అందజేశారు. ఉత్తమ ప్రదమ కనబరిచి జిల్లాకు రెండవ స్థానం ఉరవకొండకు మంచి పేరు తీసుకొచ్చారు.

ఏమార్చి బంగారం చోరీ..

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : రాంపూర్ పట్టణానికి చెందిన ఆంజనేయ(56) ఎల్ఐసి ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో బైక్ మీద పాత హడగలి రోడ్డు మీదుగా రాయదుర్గంకు వెళుతుండగా, ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్ మీదుగా వచ్చి దొంగతనాలు జరుగుతున్నాయి మీ వద్ద ఉన్న గోల్డ్ పేపర్లో పెట్టుకోండి అని చెప్పగా, ఆంజనేయులు అందుకు అంగీకరించి మెడలోని గోల్డ్ చైన్, రెండు ఉంగరాలు తీసి పేపర్లో చుట్టి బైక్‌లోనే ముందర పెట్టించినారని, ఆంజనేయులు కొంత దూరం వెళ్లి గోల్డ్ చూసుకోగా, అందులో చిన్న చిన్న రాళ్లు ఉండినాయని, మొత్తం 3 తులాల బంగారం చోరీ చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 7, ఆగస్టు 2025

విధులు చిత్తశుద్ధితో నిర్వహించాలి..

విశాలాంధ్ర-ధర్మవరం : మండల కేంద్రంలో ఉన్న మండల్ లెవెల్ స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా ఆర్డీవో మహేష్ తనిఖీ నిర్వహించారు. గోదాంలో నిల్వలో ఉన్న నిత్యావసర వస్తువులు (బియ్యం, చెక్కెర, మొదలైనవి)ని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. సరుకుల లభ్యత, పంపిణీ వివరాలను క్రాస్ చెక్ చేశారు. గోదాం నిర్వహణ, సరుకుల నిల్వ పరిస్థితులు, పరిశుభ్రత, తూకం యంత్రాల వాడకాన్ని పరిశీలించారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం సిబ్బంది విధులు పూర్తిగా నిబద్ధతతో నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యావసర సరుకులు సమయానికి, పారదర్శకంగా అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాలలో అవకతవకలకు తావివ్వరాదు.. సచివాలయాలలో అవకతవకలకు తావివ్వరాదని ఆర్డిఓ మహేష్ తెలిపారు. మండల పరిధిలోని సీసీ కొత్తకోట సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఆధార్ లింకింగ్‌లో జరిగిన పొరపాటు కారణంగా పొందాల్సిన లబ్ధి అందకపోతున్న విషయాన్ని విచారించడం జరిగిందన్నారు. వెంటనే తగిన సవరణల కోసం దరఖాస్తు చేయమని మార్గనిర్దేశం చేశారు.

శ్రేయస్సు చట్టం పరిశీలన

పట్టణ పరిధిలోని తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, శ్రేయస్సు చట్టం 2007 కింద దాఖలైన రెండు కేసులను ఆర్డిఓ మహేష్ స్వయంగా పరిశీలించారు. వృద్ధుల ఇళ్లకు వెళ్లి స్థానికులు, బాధిత వృద్ధులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, కుటుంబ సభ్యుల నుంచి అనుభవిస్తున్న వేధింపులపై విచారణ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టానికి లోబడి ప్రతి వృద్ధుడికి గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే లక్ష్యంతో సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కదిరి : వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పని చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గత 20 సం॥ల నుండి 28 మంది మహిళలు ఔట్సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్నామని, ప్రతినెలా ఇవ్వాల్సిన వేతనం క్రమంగా ఇవ్వడం లేదని, పి ఎఫ్ సంబంధించిన వివరాలు చెప్పేవారు కరువైయ్యారన్నారు. తాము కూలి రూ.25లు ఇస్తున్నప్పటి నుండి పని చేస్తున్నామని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఉద్దేశ పూర్వకంగా బయటి వాళ్లకు పని కల్పిస్తూ కార్మికుల మధ్య గొడవలు పెట్టే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈ కేంద్రంలో పని చేస్తున్న కొంతమంది అధికారులు ఇప్పటికీ మహిళా కార్మికులతో అనుచితంగా మాట్లాడుతున్నారని, బడ్జెట్ లేదనే కారణంతో తమకు పనులు కల్పించకపోగా ఇప్పుడు మళ్ళీ అదనంగా బయటి కార్మికులను పనిలోకి తీసుకుంటున్నారని తమకు న్యాయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎల్ నరసింహులు నాయకులు రామ్మోహన్, బాబ్జాన్, జగన్, ఉదయ్‌తో పాటు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

స్మార్టు మీటర్లు వద్దు.. రైతాంగాన్ని నడ్డి విరచొద్దు..

సీపీఐ ఆందోళన బాట

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని రైతుల నడ్డి విరచొద్దని సీపీఐ నాయకులతో కలసి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, నాణ్యమైన విద్యుత్తును అందచేయాలని కోరుతూ రైతులకు న్యాయం జరగాలని నినాదాలు చేశారు, ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలు పెంచుతున్నదని, గృహ వినియోగదారులకు కూడా అధిక విద్యుత్ ఛార్జీలు ఉన్నాయని వాటన్నింటినీ, తగ్గించాలని సిపిఐ పోరాట బాట పట్టిందని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటం చేస్తామని పేదల పక్షాన పోరాడుతామని శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేష్, కిష్టప్ప, మల్లికార్జున, నరసింహ, వెంకట్‌రాముడు, జాఫర్, అలివేలమ్మ, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

జిల్లా వ్య.కా.సం సమితి డిమాండ్

విశాలాంధ్ర-కదిరి: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న జరుగుతున్న అవినీతి అక్రమాల పై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీడిఓ రమేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడు తూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను పరిశీలన చెయ్యాలరు. చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు విడుదల చెయ్యాలని కోరారు. పనులు లేక చేసిన పనులకు బిల్లులు రాక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో వారికి మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రతి జాబ్ కార్డు హోల్డర్‌కు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ, ఉపాధి గ్రామీణ ఉపాధి పథకం పనిని 200రోజులు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి కమతం అంజన్ బాబు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు మధు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా హేమావతి, చంద్ర మాణిక్యం

విశాలాంధ్ర-బుక్కపట్నం : పుట్టపర్తి నియోజకవర్గ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా మండలానికి చెందిన ఇద్దరు టిడిపి నాయకులకు అవకాశం కల్పించారు. బుధవారం ప్రకటించిన జాబితాలో మండలానికి చెందిన హేమావతి, చంద్ర మాణిక్యములను మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లుగా తెలుగుదేశం ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా ఎంపికైన వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ రైతులకు అందుబాటులో ఉంటూ, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి దోహదం చేస్తామని, బడుగు బలహీన టీడీపీ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు.

దివ్యాంగులకు అన్ని సేవలు అందించడమే కేంద్రం లక్ష్యం

మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు

విశాలాంధ్ర-ధర్మవరం: దివ్యాంగులకు అన్ని సేవలను అందించడమే సాక్ష్యం దివ్యాంగ సేవ కేంద్రం యొక్క ముఖ్యము అని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు గాంధీ నగర్ లో ఈ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కేంద్రంలో యు డి ఐ డి కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని, సదరం సర్టిఫికెట్లకు సంబంధించిన సమాచారం అందిస్తా రణి, కేంద్ర ప్రభుత్వం ద్వారా నెల్లూరు సి ఆర్ సి ద్వారా అందించబడే ఉపకరణాలకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ దివ్యాంగ పథకాలపై అవగాహన కల్పించి దరఖాస్తులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దృష్టిలోపం ఉన్నవారికి బ్రెయిలీ పుస్తకములు ఉచితంగా పంపిణీ చేయబడునని తెలిపారు. టెట్టు, సిటీఈటీ, యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, డీఎస్సీ లాంటి ప్రభుత్వ నోటిఫికేషన్లు దరఖాస్తు చేయించబడునని తెలిపారు. చదువుకున్న దివ్యాంగ విద్యార్థులకు నేషనల్ స్కాలర్షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేయించబడినది తెలిపారు. ఈ విధంగా దివ్యాంగులకు ఎన్నో అవసరమైన సమాచారాన్ని, పోటీ పరీక్షలను, పరిష్కరించే దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఇలాంటి సేవా కేంద్రాలు దివ్యాంగుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ఒక గొప్ప అడుగు వేయడం అని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సహకార్య వాహ శరత్జి, సాక్ష్యం జిల్లా కన్వీనర్ పవన్కుమార్, డాక్టర్ సుబ్బారావు, శైలేంద్ర, సుధాకర్, లలితా పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో నవోదయ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-లేపాక్షి : జాతీయస్థాయి క్రీడా పోటీలలో లేపాక్షి నవోదయ విద్యార్థినిలు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపల్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఉదయం నవోదయాలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జులై 29 నుండి 31 వ తేదీల్లో పలు నవోదయాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వివరాలు ఇలా ఉన్నాయి. కేరళలోని మల్లాపురం నవోదయ లో జరిగిన జూడో అండర్ 14 పోటీల్లో సింధు హర్షిక లాస్య అక్షర యశాశ్విని అండర్ 17 శ్రీవాణి అండర్ 19 పోటీలలో ప్రతిభ కనబరిచారు. ఈ విద్యార్థులు ఆగస్టులో జరిగే పోటీలలో భోపాల్ నవోదయ లో పాల్గొంటారు. ఏలూరు లో జరిగిన అండర్ 14 క్రికెట్ పోటీలో దర్శిత్ శ్రీ సాయి, అండర్ 17 లో హేమలత వినూత్న భువనేశ్వరి ప్రణీ ప్రకాష్ ప్రతిభ కనబరిచిన వీరు హర్యానాలోని కురుక్షేత్ర నవోదయ జరగబోయే పోటీల్లో పాల్గొంటారు. గుంటూరు నవోదయాలో జరిగిన యోగ పోటీలలో చరణ్‌సాయి నిథిక్ ప్రతిభ కనబరిచారు వీరు ఈ నెలలో గుంటూరు నవోదయ జరగబోయే పోటీల్లో పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ నవోదయాలో జరిగిన కోకో అండర్ 19 పోటీల్లో సింహాద్రి ప్రతిభ కనబరిచి ఒరిస్సా రాష్ట్రంలో ని కటక్ నవోదయ జరగబోయే పోటీల్లో పాల్గొంటాడు. తెలంగాణలోని రంగారెడ్డిలో జరిగిన బాల్ గేమ్స్ క్రీడలో భవ్యశ్రీ ప్రతిభ కనబరిచి ఆగస్టులో జరిగే గుజరాత్ రాష్ట్రం రాజ్కోట్ నవోదయా లో జరగబోయే పోటీల్లో పాల్గొంటుంది. ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం నవోదయాలో జరిగిన బాల్ గేమ్స్ క్రీడలో జయదిపిక ప్రతిభ కనబరిచి ఆగస్ట్ లో జరిగే పోటీలలో బీహార్ రాష్ట్రంలోని పటాన నవోదయ లలో జరగబోయే పోటీల్లో పాల్గొంటుంది. కస్టర్గుడ్ నవోదయ లో జరిగిన బాస్కెట్ బాల్ క్రీడలో జుతేష్ ప్రతిభ కనబరిచి ఈ నెలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గుణ నవోదయ విద్యాలయ జరగబోయే పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వండి..

- ఏఐటియుసి నాయకుల డిమాండ్
- పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు రెండు నెలల నుంచి అదేవిధంగా క్లాప్ కార్మికులకు మూడు నెలల నుంచి డైలీ వెజ్ కొత్తగా విధులకు చేరినటువంటి వారికి ఏడు నెలలు బకాయిలు ఉన్నాయని వీరందరికీ ప్రతినెల జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు చాలీచాలని జీతాలతో ప్రతినెల జీతం వస్తేనే కుటుంబాలు గడుస్తాయని లాంటిది నెలలు నెలలు పెండింగ్ ఉంటే ఏ విధంగా వారు కుటుంబాలు గడుస్తాయని.. కావున ప్రతినెల పెండింగ్ లేకుండా ఖచ్చితంగా జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు అదేవిధంగా పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, కొబ్బరి నూనె, సబ్బులు లాంటి మెటీరియల్ అందజేసి వాళ్ళు అనారోగ్య పాలు కాకుండా వారికి ఇవన్నీ అందివ్వాలని కోరారు కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కరణ్, మనీ, గజేంద్ర మహేష్, బావక్క తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీటీకి ఎఫ్.ఆర్.సి.ఏను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-గుడిబండ : ఆర్‌డిటి సంస్థ ఎఫ్‌ఆర్‌సీని పునరుద్ధరించాలని కోరుతూ మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన ఆర్‌డిటి సంస్థ ద్వారా లబ్ధి పొందిన ప్రజలు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏను రద్దు చేసి బ్యాంక్ అకౌంట్ సీజ్ చేయడం శోచనీయం అన్నారు. విదేశీ నిధులతో 55 సంవత్సరాలుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 మండలాలలో గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు అనేక సేవలు అందిస్తున్న ఏకైక ఆర్డిటి సంస్థ నిరుపేద ప్రజలకు 87 వేల ఇండ్లు నిర్మాణం చేసి 55 వేల బాత్రూంలను నిర్మాణం చేసి కళ్యాణదుర్గం కనేకల్లు బత్తలపల్లి హాస్పిటల్స్ లను నిర్మాణం చేసి ప్రతి ఏడాది 8 లక్షల 50 వేల మందికి ఉచితంగా వైద్యం అందిస్తుందని తెలిపారు. అలాగే వివిధ రోగాలతో బాధపడుతున్న నిరుపేదలకు 60 వేల మందికి సర్జరీలు చేసి ఆరోగ్యాన్ని కాపాడి, 3 వేల 500 గ్రాములకు 3 వేల మంది ఉద్యోగులతో 4 లక్షల 50 వేల కుటుంబా లకు సేవలు చేస్తుందన్నారు. అలాగే కోటి మంది రైతులకు లక్షల పండ్ల మొక్కల పంపిణీ, లక్ష 10 వేల ఎకరాల్లో 37 వేల మంది రైతులకు డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింక్లర్ పరికరాలు, 43 వేల మంది బాలికలకు ఉచితంగా సైకిళ్ళ, వికలాంగులకు 1000 800 మందికి గాను మూడు పాఠశాలల నిర్మాణం, వేలాదిమంది వికలాంగులకు ఉపాధి కల్పన వివిధ రంగాల్లో సిరపడే అవకాశాలను కల్పించిందని పేర్కొన్నారు.

జాతీయ కరాటే క్రీడా పోటీల్లో యశోద పాఠశాల విద్యార్థి సత్తా

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 3వ తేదీన బెంగళూరులోని కోడికొండన హళ్లిలో జరిగిన జపాన్ కరాటే షార్ట్ కాన్ లో 13వ జాతీయ కరాటే పోటీలలో యశోద పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి పి.మహీధర్ కుమితే, కటా విభాగాలలో పాల్గొని బంగారు పతకం కైవసం చేసుకుందని పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్, కరాటే మాస్టర్ బాషా తెలిపారు. ఆ విద్యార్థిని అభినందించారు. విద్యార్థి తండ్రి వెంకటేశ్వర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సిద్దయ్య గుట్ట వద్ద గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన నిర్మాణం ఆలయ కమిటీ వారు చేపట్టుతున్నారు. ఇందులో భాగంగా ఆలయ నిర్మాణం నిమిత్తం పట్టణంలోని జగ్గా చంద్రకళ వారి భర్త జ్ఞాపకార్థం లక్ష రూపాయల నగదును విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షురాలు సంకారపు జయ శ్రీ ఆలయ కమిటీ తరఫున జగ్గా చంద్రకళ కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, కుటుంబం పేరిట ప్రత్యేక పూజలను నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ధర్మవరం : 2025 సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని అనంతపురం, శ్రీ సత్య సాయి ఉమ్మడి జిల్లాలలోని ప్రభుత్వం రంగంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు 15 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు ఆత్మీయ ట్రస్ట్ ధర్మవరం వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. యుటిఎఫ్ ధర్మవరం జోన్ నాయకులతో కలసి ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో మాట్లాడుతూ బోధనలో అద్భుతమైన ప్రతిభతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ, నైతిక విలువలతో తమ సర్వీసులో ఎటువంటి క్రమశిక్షణ చర్యలకు లోను కాకుండా ఉన్న వారు ఈనెల 20వ తేదీ లోపల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కోసం దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9030944717 , 9441734907లో సంప్రదించాలన్నారు.

చేనేతకు శఠగోపం, మాస్టర్ వీవర్ల స్వార్థం

విశాలాంధ్ర- ధర్మవరం: చేనేతకు శఠగోపం పెడుతూ మాస్టర్ల వీవర్ల స్వార్థంతో పవర్లూమ్స్ మోసాలతో చేనేత కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చేతివృత్తుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఒకప్పుడు చేనేత కార్మికుల హక్కుల కోసం పోరాడిన మాస్టర్ వీవర్లు, ఇప్పుడు మిల్లుల యజమానులుగా మారి, చేనేత పరిశ్రమకు శాపంగా మారారని తెలిపారు. పవర్ లూమ్స్ విస్తరించడం, చేనేత రిజర్వేషన్ చట్టం అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల చేనేత కార్మికుల బతుకులు ఛిద్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ వీవర్లు పవర్ లూమ్స్‌లో ఎక్కువ కూలీలు ఇస్తామని ఆశ చూపించి, చేనేత కార్మికులను ఆ వైపు మళ్లిస్తున్నారని కార్మికులు చేనేత మగ్గాలను వదిలి పవర్ లూమ్స్ లో చేరిన తర్వాత, కూలీలను భారీగా తగ్గించి, వారి కష్టాన్ని దోచుకుంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక పవర్ లూమ్ మీద ఒక కార్మికుడు 1000 రూపాయల కూలీ, ఇప్పుడు అదే కార్మికుడికి 500-600 రూపాయల మాత్రమే ఇస్తున్నారు అని తెలిపారు. దీనివల్ల కార్మికుల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతోంది అని తెలిపారు. 1985ను పకడ్బందీగా అమలు చేసి, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. మాస్టర్ వీవర్ల మోసాల నుంచి చేనేత కార్మికులకు రక్షణ కల్పించాలని, సంక్షేమ పథకాలు నిజమైన కార్మికులకు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం ఆపేసిన 24 నెల నేతన్న నేస్తం కార్యక్రమానికి మరో మరో 12000 పెంచి 36 వేలకు పెంచి చేనేత కార్మికులందరినీ ఆదుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. ఫోర్స్‌మెంట్ అధికారులు చేతులెత్తేసి లంచాలు పుచ్చుకొని వెళ్ళిపోతు న్నారని తెలిపారు. మరి చేనేత కార్మికులను ఆదుకునేది ఎవరు? అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఏ ప్రభుత్వం కూడా ఆదుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు వెంకటస్వామి, శ్రీనివాసులు, రంగయ్య పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతోనే వైసీపీ బలోపేతం

విశాలాంధ్ర-అగళి : మండల పరిధిలోని హళ్లికేర ఆలూడి గ్రామపంచాయతీలలో వైసీపీ నాయకుల విస్తృత సమావేశాన్ని నిర్వహించారు ముఖ్య అతిథులుగా తాలూకా పరిశీలకులు లీలా రెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ జయ కుమార్, స్థానిక నాయకులు హాజరయ్యారు. సర్పంచి ముద్ద రాజు మాట్లాడుతూ గ్రామాలలో వైసీపీ నాయకులు కార్యకర్తలు ఐకమత్యంగా ఉండాలని సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వక్కలిగా కన్వీనర్ రంగే గౌడ్ మండల ఉపాధ్యక్షులు విమల సదానంద ఆరాధ్య, సర్పంచులు ముద్దరాజు, మంజుల నటరాజ్, ఎంపీటీసీ సభ్యులు మంజుల సతీష్, గౌడ్, లింగమ్మ బసవరాజు సర్పంచ్ బసవరాజు, కంబద పల్లి నాగేంద్రప్ప, రామలింగప్ప, కృష్ణ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఘన సన్మానం

విశాలాంధ్ర-అమరాపురం : మండలం వలస సచివాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన అధికారులకు వలస సచివాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు బుధవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసిస్టెంట్ శివరాజు విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్ లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ పవన్ కుమార్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఘనంగా సన్మానం చేశారు. కొత్తగా వచ్చిన సిబ్బందికి ఆహ్వానం పలుకుతూ ఈ కార్యక్రమానికి వలస సర్పంచ్ నాగవేణి హితేంద్ర, పంచాయతీ కార్యదర్శి వీరకరియప్ప, మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్ శివరుద్రప్ప టిడిపి పంచాయతీ కన్వీనర్ నాగరాజు, నిరంజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, నాగేంద్రప్ప, అంగన్వాడీ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు : సత్యసాయి వాటర్ సప్లైలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు పోషించుకోవడం కష్టతరంగా ఉందని సత్యసాయి వాటర్ సప్లై యూనియన్ నాయకులు రాంప్రసాద్, కేశవయ్య, శివారెడ్డి, కిష్టప్ప అన్నారు. కొత్తచెరువు పుట్టపర్తి రోడ్‌లో ఉన్న వాటర్ సప్లై కేంద్రం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్ కార్యాలయం వద్ద వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 1000 గ్రామాలకు 10 లక్షల మంది ప్రజలకు 543 మంది కార్మికులు కష్టపడి ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అందిస్తున్నారన్నారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే సమ్మె ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ బాలాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాదా పీర్, సలీం, జయ, శ్రీనివాసులు, రమేషు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-కదిరి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కోచింగ్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. బుధవారం కె.యల్.యన్ కోచింగ్ సెంటర్‌లో డిసెంబర్ 13న జవహర్ నవోదయ నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న గ్రామీణ విద్యార్థులకు 5 నెలల పాటు ఉచిత కోచింగ్ ఇస్తున్నా మని ఈ సదావకాశాన్ని ఉమ్మడి జిల్లాలలో 5,8 తరగతులు చదివే వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఏడాది ఇలాంటి ఉచిత కోచింగ్ ఇస్తూ వందలాది మందికి బంగారు భవిష్యత్తు ఇచ్చామని మరిన్ని వివరాలకు 9398629919, 73821,51193 సంప్రదించాలని కోరారు.

రెండు రోజుల్లో 298.2 మి.మీ వర్షపాతం

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం డివిజన్లోని ఏడు మండలాలలో ఈనెల 5వ తేదీ, 6వ తేదీలలో మొత్తం 298.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని ఆర్డిఓ మహేష్ తెలిపారు. ధర్మవరంలో మిల్లీమీటర్లు, బత్తలపల్లిలో 7.6, తాడిమర్రిలో 8.22, ముదిగుబ్బలో 90.8, కనగానపల్లిలో 14.8, చెన్నై కొత్తపల్లిలో 36.8, రామగిరి లో 40.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఓ. గోపాల్ పాల్గొన్నారు.

చేనేత దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కదిరి గేట్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం సమీపంలో ఈనెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, కలెక్టర్ టీ.ఎస్. చేతన్‌లు హాజరవుతారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను మంత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్ బాబు, ఆర్డీఓ మహేష్, తహసిల్దార్ సురేష్ బాబుసమీక్షిస్తూ, తగిన ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, తాసిల్దార్ సురేష్ బాబు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ అధ్యక్షులు చంద్ర, బిజెపి నాయకులు పోతుకుంట రాజు, సోమ్లా నాయక్, గంగాధర, చిన్న లింగమయ్య, రవిపాల్గొన్నారు.

ఆర్.డి.టి ఎఫ్.సి.ఆర్.ఏ పునరుద్ధరించాలి..

విశాలాంధ్ర-రొళ్ల: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు మహిళలకు వికలాంగులకు విద్యార్థులకు నిత్యం సేవలందిస్తున్న ఆర్.డి.టి సంస్థకు సంబంధించిన ఎఫ్.సి.ఆర్.ఏను పునరుద్ధరించాలని తహసీల్దార్ షేక్షావలి వినతిపత్రం అందజేశారు బుధవారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అలుపనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డిటి సంస్థ పక్క గృహాలు నిర్మించిందని, విద్య, వైద్యం కల్పించి అండగా ఉందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌డీటీ ఎఫ్.సి.ఆర్‌ను రెన్యువల్ చేయించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు కోరారు.. ఈ కార్యక్రమంలో ఆర్డిటి సభ్యులుప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-బుక్కపట్నం : రైతుల సంక్షేమం కూటమిత్ర ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కూటమి నాయకులు తెలిపారు. జిల్లాలోని అతి పెద్ద చెరువు అయిన బుక్కపట్నం చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే ప్రధాన సాగునీటి కాలువలు మరమ్మతు పనులను బుధవారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి సంఘానికి నిధులు మంజూరు చేయడంతో బుక్కపట్నం చెరువు కింద రైతులపంట పొలాలకు వెళ్లే ప్రధాన కాలువలు కుంచించుకుపోయి, ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, డ్రైనేజీ నీటితో నిండిపోయి కాలువలు అద్వానస్థితికి మారిపోయి, నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా మారిపోయింది. నిధులు మంజూరు కావడంతో రైతుల సౌకర్యం కోసం జెసిపి యంత్రాల సహాయంతో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పత్తి చంద్రశేఖర్, మలిరెడ్డి, పూల శివప్రసాద్, సంజీవ రాయుడు, చెన్నకృష్ణ, ఎర్రకేసి, వెంకట రాముడు, దాసరి శ్రీనివాసులు, సయ్యద్ భాష, ఆదినారాయణ, సతీష్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 07, ఆగస్టు 2025

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువు లోనే విద్యుత్ సబ్‌స్టేషన్ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ముట్టడి కార్యక్రమాన్ని సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు, ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విద్యుత్ కోతలు అధికంగా ఉన్నందున గృహ వినియోగదారులు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఏమో బిల్లులు అధికంగా వసూళ్లు చేస్తుంది కానీ విద్యుత్తు సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ముఖ్యంగా కొత్తచెరువు పట్టణం లో పగల పూట విద్యుత్తు కోతలు తీవ్రంగా ఉండడంతో గ్రామ ప్రజలు వ్యాపార సముదాయాలు చిన్న పరిశ్రమల వారు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ బిల్లు కట్టించుకునే కాంట్రాక్ట్ బిల్లు కలెక్టరు అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి ప్రజలు ఎదురుచూస్తున్న రావడంలేదని ఆయన పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఈ వెంకటేష్ నాయక్ ని,లదీశారు తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆయనకు వినత పత్రం అందజేశారు. సిఐటియు కో కన్వీనర్ శంకర్ రెడ్డి, భాష, ప్రజలు పాల్గొన్నారు.

ఏడు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

విశాలాంధ్ర-ధర్మవరం : ప్రభుత్వం ఏర్పాటుచేసిన గ్యాస్ సిలిండర్లను కొంతమంది వ్యాపారస్తులు వ్యాపారం నిమిత్తం నిల్వ ఉంచిన ఏడు గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్సై వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రంగా థియేటర్ పక్కన ఉన్న ఓ దుకాణంలో ఆ శాఖ ఎస్సై వెంకటప్రసాద్ సిఎస్‌టి చెన్నకేశవ నాయుడు వీఆర్వో బాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేయడంతో ఈ ఏడు గ్యాస్ సిలిండర్ల భాగవతం బయటపడింది. అనంతరం ఈ ఈ సిలిండర్లను రెవెన్యూ అధికారులుగా పెంచి షాపు యజమానిపై కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా విజిలెన్స్ ఎసై వెంకటప్రసాద్ తెలిపారు.

కారు అదుపుతప్పి లారీని ఢీ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని పరమేశ్వరపురం తండా సమీపం ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ ఎదురుగా కారు అదుపుతప్పి లారీని ఢీకొనడంతో నుజ్జు నుజ్జు అయిన కారు ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

మోసాల హామీలతో ప్రజల్లో వ్యతిరేకత..!

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండలం పరిధిలోని మందలపల్లి జమ్మలమండ గ్రామాలలో బాబు షూటి మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ఓట్లను వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేస్తున్నారని రాష్ట్రంలోని ప్రజలు చంద్రబాబు నాయుడు పై వ్యతిరేకత మొదలైంది అన్నారు. ఈ విషయాన్ని గుర్తించుకొని చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అలాగే గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడానికి గ్రామస్థాయిలో కమిటీలు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జడ్పిటిసి భూతరాజు, మండల అధ్యక్షుడు డిఎల్ యంజార్ గౌడ్ మందలపల్లి సర్పంచ్ అశ్వత్, స్థానిక నాయకులు వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకి అమృతం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ సీడీపీఓ ధనలక్ష్మి ఆధ్వర్యంలో ప్రాజెక్టు స్థాయిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలే శ్రీరామరక్ష అని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందించాలని, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, 6నెలల తర్వాత అనుబంధ పోషకాహారం ఇస్తూ తల్లిపాలు కనీసం రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలి అని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లలలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని,తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వాళ్ళ తల్లికి రొమ్ము కాన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. గర్భవతులు, బాలింతలు పౌష్టికహారం తీసుకోవాలి, ప్రశాంత మైన వాతావరణం లో జీవించాలని అని తెలిపినారు. తల్లి పాల వల్ల బిడ్డకు మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుంది అని తెలినారు.పరిసరాల పరిశుభ్రత పాటించాలి అని అలాగే ప్రతి నెల 0నుండి 6సంవత్సరాల పిల్లలందరికి ఖచ్చితమైన బరువులు, ఎత్తులు తీసి పిల్లలో వున్న పౌష్టికాహార లోపాన్ని గుర్తించాలని,తల్లులలకు కౌన్సిల్లింగ్ ఇచ్చి పిల్లలలో వున్న పౌష్టికాహారలోపాన్ని తగ్గించాలి అని తెలిపారు. ఈ సమావేశం లో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పుష్పలత, విజయలక్ష్మి, ప్రాజెక్టు స్థాయి అంగన్వాడీ కార్యకర్తలు బావమ్మ, జయమ్మ, మాబున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్లు ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలో అక్రమ లేఔట్లు వేసి ప్లాట్లు అమ్ముకుంటున్న రియల్టర్లు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ ఆర్ ఎస్) ను సద్వినియోగం చేసుకుని తమ లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపిడివో పార్థసారథి,డిప్యూటీ ఎంపీడీవో మాధవ రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 30 వరకు కొనుగోలు చేసిన యజమానులు ఈ స్కీమ్ కింద 90 రోజుల వరకు అహుధాను సంప్రదించి సంబంధిత దరఖాస్తును అందజేసి నిబంధనల ప్రకారం రుసుమును చెల్లించాలని తెలిపారు. ఈ స్కీమ్ కింద సంబంధిత ఫీజు 45 రోజుల లోపు చెల్లించిన వారికి 10 శాతం రాయితీ కూడా అహుదా వారు కల్పించడం జరిగిందన్నారు. దరఖాస్తుదారులు తమ సేల్ డీడ్,సైట్ ప్లాన్, ఈసి తదితర ఇతర అవసరమైన ధ్రువపత్రాలను వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని. దరఖాస్తుదారులు దరఖాస్తు చేయి సమయంలో 50 శాతం రుసుము లేదా కనీసం పదివేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ కింద రెగ్యులర్ చేసుకోని లేఅవుట్ దారులు మరియు ప్లాట్ యజమానులు ఆ స్థలంలో ఎటువంటి కట్టడాలు కట్టడానికి అనుమతులు ఇవ్వబడవని, అనుమతులు లేకుండా కట్టడాలు జరిగిన, అమ్మకాలు జరిపిన వారిపై చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. అక్రమ లేఔట్‌లో అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరించు కోవడానికి ఇదే చివరి అవకాశమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ బస్సు కోసం విద్యార్థులు ఆందోళన

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండల పరిధిలోని చిన్న ముష్టూర్ గ్రామం వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలకు ప్రతిరోజు రెండు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ ఆదర్శ పాఠశాలకు చెందిన ఆదర్శ విద్యార్థులు బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ముందు రోడ్లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ దాదాపు 150 మంది విద్యార్థులకు కేవలం ఒక బస్సు ఉండడంవల్ల ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది అన్నారు. ఉదయం బస్సులో వెళ్లాలన్న సాయంత్రం తిరిగి రావాలన్న ప్రతిరోజు నరకయాతన అనుభవిస్తున్నామని వాపోయారు. ఆర్టీసీ అధికారులకు విద్యార్థుల సమస్యలు పట్టవా ?మా బాధలు మీకు అర్థం కావా అంటూ ప్రశ్నించారు. రెండు బస్సులు నడపాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించిన అధికారుల్లో మార్పు రాకపోవడంతో విద్యార్థిని,విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా దాదాపు అరగంట పాటు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థులు చేపట్టిన ఆందోళన దాదాపు అరగంట పాటు కొనసాగడంతో ట్రాఫిక్ జామ్ కావడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన విరమించలేదు.అనంతరం ఆర్టీసీ అధికారులు పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులకు ఇబ్బందులకు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వికలాంగుల పింఛన్లు తొలగింపు అన్యాయం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం శెట్టిపల్లి పంచాయతీ నందు దాదాపు 25 మంది పైగా పింఛన్లను తొలగించడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఉషశ్రీ చరణ్ మరియు పింఛను కోల్పోయిన వికలాంగులతో కలిసి పెనుకొండ ఎంపీడీవో నరేష్ కృష్ణతో మాట్లాడి వీరికి తక్షణమే పెన్షన్లు పంపిణీ చేయాలని వినతి పత్రం అందజేశారు. ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం వృద్యాప, వితంతువు, వికలాంగులు పింఛన్లు ప్రతి నెల పింఛన్లు తీసుకునే వారిని ఈ నెల నుంచి వికలాంగుల పింఛన్లు తొలగించడంతో కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు, ఎన్నికల ముందు బాబు షూరిటీ అంటూ చెప్పుకొచ్చిన చంద్రబాబు ఇప్పుడు చంద్రబాబు మోసం గ్యారెంటీ అనేలా పరిపాలన చేస్తున్నారన్నారు, ఏడాదిలోపే లబ్ధిదారులైన వికలాంగుల పెన్షన్లు తొలగించడం చాలా బాధాకరమన్నారు, రాష్ట్రంలో వెరిఫికేషన్ పేరుతో లక్షలాది పింఛన్లు తొలగిస్తున్నారని, ఇలానే జరిగితే రాబోయే రోజుల్లో పెన్షన్లు తొలగించిన బాధితులతో కలిసి కలెక్టర్ ఆఫీస్ ను ముట్టడించే కార్యక్రమం చేపడతామన్నారుఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, సుధాకర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-గుంతకల్లు: మహిళలకు ఉచిత శిక్ష నుంచి వారి జీవనం ఉపాధికి సహకరిస్తున్నారని గుంతకల్ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు విక్టరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పెద్ద మనసుతో మంచి సంకల్పంతో వందల మందికి మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చి వారి జీవనోపాధికి సహకరిస్తున్నారని విక్టరీ ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రమాదేవి, పత్తి హిమబిందు పాల్గొన్నారు.

ఇక నుంచి పరీక్షలకు ఆన్సర్ బుక్లెట్

విశాలాంధ్ర-బొమ్మనహాల్: ఇక నుంచి పరీక్షలకు ఆన్సర్ బుక్ లెట్ ఉపయోగించనున్నారు. సబ్జెక్టుల వారీగా ఆన్సర్ బుక్లెట్లను ప్రభుత్వం మండ లాల వారీగా ఎమ్మార్సీలకు సరఫరా చేసింది. బుధవారం బొమ్మనహాల్ ఎంఆర్సి కార్యాలయంలో ఎంఈఓ మల్లికార్జున మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలకు మొత్తం 50 పాఠశాలలకు40220 మంది విద్యార్థులు అన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు .తెలిపారు.పరీక్షల సమయంలో ఏ4, లీగల్ పేపర్లలో విద్యా ర్థులు పరీక్షలు రాసే వారు. అవసరమైన పక్షంలో అదనపు పేపర్ల కోసం ఇబ్బందులు పడేవారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థు లందరికీ ఎఫ్ఎ1, ఎస్ఏ 2, ఎస్ఏ 3, ఎస్ఏ 4, ఎస్ఏ 1, ఎస్ఏ 2 పరీక్షలకు సంబంధించి అన్ని టైటిల్ ఎగ్జామ్స్కు ఆన్సర్ బుక్ లెట్లు సరఫరా చేసినట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు అమరేష్, భాస్కర్, రామాంజనేయులు, ఇస్మాయిల్, మంజప్పా, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వ్యక్తికి నివాళి

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని హిరేతృప్తి గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో తిమ్మన్న మృతి చెందిన విషయం తెలిసిందే అలాగే మడకశిర మండలంలోని ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ మంగళవారం పిడుగుపాటుతో మృతి చెందింది

విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి మడకశిర ప్రభుత్వాసుపత్రిలో పంచ నామాలు నిర్వహించిన సందర్భంగా హిరేతృప్తి తిమ్మన్న, ఉప్పార్లపల్లి రత్నమ్మ లకు రెండు మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మీ కుటుంబాల అండగా ఉంటుందని అధైర్యం పడవద్దని వారికి సూచించారు.

బదిలీపై వెళ్లిన ఆరోగ్య సిబ్బందికి ఘన సన్మానం

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదోన్నతిపై వెళ్లిన సిబ్బందికి,బదిలీపై వెళ్లిన సిబ్బందికి రాయలచెరువు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్ డాక్టర్ అప్పయ్య ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు బదిలీపై వెళ్లిన వారిని బుధవారం ఘనంగా సన్మానించారు. పి హెచ్ ఎన్ సుమతీదేవి ప్రమోషన్ పై పిహెచ్‌సి ప్యాపిలి సిహెచ్ఓగా వెళ్లడం ,లక్ష్మన్న ఎంపీ హెచ్ ఈ ఓ చుక్కలూరు పిహెచ్‌సికి, ఫిమేల్ సూపర్వైజర్ సరోజమ్మ పి.హెచ్.సి ప్యాపిలికి ఏఎన్ఎం రంగమ్మ విజయలక్ష్మి శోభ రమాదేవి రామలక్ష్మి బదిలీపై వెళ్లారు. ఆరోగ్య కేంద్రంలో వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు చుక్కలూరు సూపర్వైజర్ ఎంపీ నారాయణ, యాడికి సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, 104 సిబ్బంది నాయుడు అనిల్ మేల్ హెల్త్ అసిస్టెంట్లు నారాయణస్వామి కిరణ్ కుమార్ దాస్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర-రొళ్ల: ప్రపంచ తల్లి వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాలు వారోత్సవాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తహసీల్దార్ షేక్షావలి,ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలిపాలే బిడ్డలకు శ్రేయస్కారమని తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని బిడ్డకు ఆరు నెలలు నిండే వరకూ కేవలం తల్లి పాలను మాత్రమే ఇవ్వాలని,తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అన్నారు డబ్బా పాల వల్ల పిల్లలు ఎదుగుదల లోపంతో పాటు అనారోగ్యాలకు గురవుతారని తల్లిపాలే వరమన్నారు,రెండు సంవత్సరాలు నిండే వరకూ అనుబంధ పౌష్టికాహారంతో పాటు తల్లి పాలను కూడా ఇవ్వాలని తెలియ జేశారు,తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటిదని,తల్లి పాలను బిడ్డ తాగటం వలన బిడ్డలో పోషక విలువలు పెరుగుతాయని,తల్లికి కూడా రొమ్ము క్యాన్సర్ లాంటి అనారోగ్య సమస్యలు రావన్నారు,అనంతరం ర్యాలీ నిర్వహించారు,ఈ కార్యక్రమానికి అంగన్వాడీ కార్యకర్తలు,తల్లులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డలకు ఆరోగ్య పరిరక్షణ

విశాలాంధ్ర-తాడిపత్రి: తల్లిపాలతోనే బిడ్డలకు ఆరోగ్య పరిరక్షణ అని సిడిపిఓ సాజిదా బేగం పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శివాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ ఫంక్షన్ హాల్‌లో తాడిపత్రి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఓ సాజిదా బేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే బిడ్డలకు మురుపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు సులువుగా జీర్ణం అవుతాయి. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుంది. తల్లులు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల గర్భధారణ సమయంలో పొందిన బరువును తగ్గించుకొనుటకు సహాయపడుతుంది. ఎవరైతే స్త్రీలు శిశువుకు తల్లిపాలు ఇస్తారో వారిలో రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కావున తల్లులు బిడ్డలకు తప్పక పాలు ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు శ్రీమతి పి.ఉమాదేవి, లక్ష్మీదేవి, యం.నాగేశ్వరి, కె.విజయ కుమారి, శంషాద్ బేగం, బి.వెంకటలక్ష్మి, బి.విజయకుమారి, కె.రామలక్ష్మమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీమతి పల్లవి సీనియర్ అసిస్టెంట్ అన్వర్ భాష 5 మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ తీర్థం పుచ్చుకున్న మాజీ సింగల్ విండో డైరెక్టర్

విశాలాంధ్ర - కూడేరు: మండల పరిధిలోని పి.నారాయణపురం గ్రామానికి చెందిన మాజీ సింగల్ విండో డైరెక్టర్ హనుమంత్ రెడ్డి బుధవారం భారతీయ జనతా పార్టీలోకి అనంతపురంజిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డిని బిజెపి పార్టీలోకి సాధారణ స్వాగతం పలుకుతూ పార్టీ కండువాతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు కొనుకొండ రాజేష్ మాట్లాడుతూ. బిజెపి పార్టీలోకి. వలసల సంఖ్యలు భారీగా పెరుగుతున్నాయని బిజెపి పార్టీపై అభిమానం ఉన్నవారు భారత ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,, బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎస్ మాధవ్ న్యాయకత్వంలో బిజెపి పార్టీ గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపి పార్టీలోకి చేరిన హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి జిల్లా అధ్యక్షుడు బీసీ వర్గానికి చెందిన ఆయన రాజకీయంగా అనునిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతున్నాడని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నందున వారు చేస్తున్నటువంటి దేశం కోసం ప్రజల క్షేమం కోసం ఆకర్షితునై బిజెపిలో చేరడం జరిగిందని ఆయన విలేకరులకు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం అనునిత్యం పాటుపడతానని అన్నారు.=

అన్నదాత సుఖీభవ,తల్లికి వందనంపై ప్రత్యేక పరిష్కార వేదిక ..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండల రైతు సోదరు లందరికీ, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు కూటమి నాయకులకు ప్రజలకు కార్యకర్తలకు తెలియజేస్తూ మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్ ప్రకటన విడుదల చేశారు గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి, సవితమ్మ అదేశల మేరుకు ఉదయం 10 గంటలకు తాహసిల్దార్ కార్యాలయం నందు అన్నదాత సుఖీభవ , తల్లికి వందనం పడని వాళ్లకు స్పెషల్ గ్రీవెన్స్ డే నిర్వహించబడును.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్ కృష్ణ, ఎమ్మార్వో స్వాతి, వ్యవసాయ అధికారి, చందన,మండల విద్యాశాఖ రాఘవయ్య, మండల నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించబడును.కావున పెనుకొండ మండల రైతు సోదరులందరులు మరియు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పార్టీ నాయకులు కార్యకర్తలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేష్ కృష్ణ, కన్వీనర్లు ఈశ్వర ప్రసాద్, శ్రీరామ్ యాదవ్. తెలిపారు.

పంచాయతీ కార్మికుడు మృతి

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికుడు ఆది నారాయణ బుధవారం మృతి చెందాడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూనే విధులకు హాజరవుతూ ఉండేవాడని తోటి కార్మికులు తెలిపారు కాగా కుంట ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు స్థానికులు వెళ్లి ఆసుపత్రికి తరలించాలని ప్రయత్నం చేశారు. అయితే నారాయణ అప్పటికే ప్రాణాలు వదిలినట్లు తెలుసుకున్నారు ఇన్చార్జి పంచాయతీ ఈవో శశికళ ఇతర సిబ్బందితో మృతుడి నివాస గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయం రూ. 5వేలు అందజేశారు.

బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందికి ఘన సన్మానం

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండలం చందన సచివాలయంలో ఐదేళ్లపాటు సేవలందించి బదిలీపై వెళ్తున్న జీవిత, రామలక్ష్మమ్మ, రాజశేఖర్, భక్తాను బాబు, వాసు దేవరావులను గ్రామ పెద్ద జి రామాంజనేయులు మరియు పంచాయతీ కార్యదర్శి వి.వెంకటరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద మాట్లాడుతూ మా గ్రామ సచివాలయ సిబ్బంది ఐదు సంవత్సరముల పాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు సేవలు అందించారని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చందన గ్రామ సర్పంచ్ రామాంజనేయులు సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



విశాలాంధ్ర-అనంతపురం: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మెడికల్ కళాశాల సామాజిక వైద్యశాస్త్ర విభాగం, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా మెడికల్ విద్యార్థులకు నర్సింగ్ విద్యార్థినిలకు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ తెలుగు మధుసూదన్, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయేశ్వరి తిలకించి అందులో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రశంస పత్రాలు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను సమాజంలోని తల్లులందరికీ, మహిళలందరికీ, ముఖ్యంగా చదువుకుంటున్న విద్యార్థులకు తెలియజేసినట్లయితే తల్లిపాలతో మంచి వ్యాధి నిరోధక శక్తి సామర్థ్యాన్ని పుట్టిన పిల్లలు తెచ్చుకొని వ్యాధుల సంక్రమణకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటారని, తల్లిపాల వలన వచ్చే వ్యాధి నిరోధక శక్తి సామర్థ్యం జీవితమంతా వ్యాధులు నియంత్రణలో ప్రముఖ పాత్ర వహిస్తుందని, అందుకే ప్రతి తల్లి కనీసం రెండు సంవత్సరాల పాటు తమ పిల్లలకు పాలను ఇవ్వాలని, డబ్బా పాలు కంటే తల్లిపాలే శ్రేయస్కరం అన్న విషయాన్ని సమాజంలోని మహిళలందరికీ తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు డాక్టర్ భాస్కర్ నాయక్ డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సుష్మ, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.